అంగన్వాడీలు సంతకాల సేకరణ

విజయనగరం (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కొనసాగిస్తున్న ఉద్యమంలో భాగంగా శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. అర్బన్ ప్రాజెక్టు మూడో సెక్టార్‌లో భాగంగా జగన్మోహన్‌రావు, తమ్మయ్య ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం మొండి వైఖరితో ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం ఎంత వరకూ సబబని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యవాదులంతా దీనిని ఖండించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్వరీ, సత్యవతి, పైడిరాజు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.





సంక్రాంతి శోభ

● నేడు భోగి

- సందడిగా గ్రామాలు.. పట్టణాలు
- కిటకిటలాడుతున్న మార్కెట్‌లు
- ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులు, రైళ్లు

పండగ వచ్చేసింది.. సందడి తెచ్చేసింది.. నెల గంటు తర్వాత ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సంక్రాంతి వేడుక ఆదివారం భోగీతో ఆరంభం అవుతోంది. పెద్దలు, పిల్లలు, యువకులు, మహిళలు కొంగొత్తగా ముస్తాబై కలిసికట్టుగా అసలు సంబరాల్లో మునిగి తేలనున్నారు. మరోవైపు పల్లెలు కొత్తదనాన్ని రంగరించుకున్నాయి. నగరాలు నవ్యంగా తయారయ్యాయి. ఎక్కడెక్కడో స్థిరపడిన జిల్లా వాసులు సొంత ప్రాంతాల్లో అడుగు పెట్టారు. వారికి స్నేహితులు, స్వగ్రామస్థులు అపూర్వంగా స్వాగతం పలికారు. పలకరింపులతో హత్తుకున్నారు. ఆదివారం వేకువజామున భోగి మంట వద్ద కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సంస్కృతీసంప్రదాయాలు తొణికిసలాడే సంక్రాంతి సంబరాలు ఈసారి కూడా అంబరాన తాకనున్నాయి.

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్

ఇంటింటా సంబరం.. ఊరంతా ఉల్లాసం.. అందరిలో ఒకటే ఉత్తేజం తీసుకొచ్చే పండగ వచ్చేసింది. సంక్రాంతికి సొంతూరులో సరదాగా గడపాలని.. స్నేహితులతో కేరింతలు కొట్టాలని.. ఆట పాటల్లో మునిగితేలాలని ఉవ్విళ్లూరుతూ ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా జిల్లాకు వచ్చేశారు. ఇప్పటికే చాలా వరకు స్వగ్రామాలకు చేరుకున్నారు. మిగిలిన వారు భోగి రోజుకు వస్తారు. వారి ప్రయాణంతో బస్సులు, ప్రైవేటు వాహనాలు, రైళ్లు కిటకిటలాడుతున్నాయి. మరోవైపు పండగకు అవసరమైన సరంజామా, దుస్తులు, నిత్యావసరాలు కొనుగోలుకు అందరూ మార్కెట్ బాట పట్టారు. విజయనగరం ప్రధాన మార్కెట్‌కు శనివారం ఇసుకేస్తే రాలనంతగా జనం పోటెత్తారు. కొనుగోళ్లతో దుకాణాలన్నీ కిటకిటలాడాయి. ఇదే సమయంలో భోగి పండగ కోసం ప్రజలంతా సిద్ధమయ్యారు. పోటాపోటీగా మంటలు వేయాలని కర్రలు, చెక్కలు సేకరించి పెట్టుకున్నారు. పండగ భోగితోనే మొదలుకానుంది. ఇదిలా ఉండగా మహిళలు పిండివంటలతో కొత్తకొత్త రుచులు అందించేందుకు వంట సామగ్రిని సిద్ధం చేశారు. మరోవైపు హరిదాసులు, గంగిరెడ్ల వారు, బుడబుక్కల వారు, డూడూబసవన్నలు, కొమ్మదాసులు పల్లెలను సందర్శించి అందరికీ వినోదం పంచుతున్నారు.





కిటకిటలాడుతున్న విజయనగరం ప్రధాన మార్కెట్



మార్కెట్‌లో కొనుగోళ్లు

● మార్కెట్‌కు ముందుగానే పండగ కళ వచ్చింది. దుస్తులు, నగలు, కొత్త పాత్రలు, నిత్యావసరాలు, స్వీట్లు ఇలా అన్నింటి కొనుగోలుకు ప్రజలంతా మార్కెట్ బాట పట్టారు. రెండు రోజులుగా ఇసుకేస్తే రాలనంతగా మార్కెట్ కనిపిస్తోంది. విజయనగరం మార్కెట్ జిల్లాకే ప్రత్యేకం కావడంతో ఎటు చూసినా జనమే కనిపిస్తున్నారు. ఆదివారం కూడా ఇదే విధంగా ఉండే అవకాశం ఉంది. మూడులాంతర్ల నుంచి కన్యకాపరమేశ్వరీ ఆలయం, చిన్నవీధి, ఆర్ అండ్ బీ జంక్షన్, రైతు బజారు జంక్షన్, కంటోన్మెంట్, ఆర్‌అండ్‌బీ, రైతుబజారు ప్రాంతం కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి.

భోగికి సన్నద్ధం..

మూడు రోజుల పండగలో తొలి రోజు భోగి వేస్తారు. అందుకు అవసరమైన కర్రలను సేకరించి పెట్టారు. సంప్రదాయం ప్రకారం ఆవు, గేదె పేడతో పిడకలను తయారు చేసి సిద్ధంగా ఉంచారు. వీటిని మంటల్లో వేయనున్నారు. ధనుర్మాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో గోదాదేవి కళ్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని చిన్న పిల్లలకు భోగి పండ్లు వేయనున్నారు.

సంతోషాల సంక్రాంతి కావాలి: కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్: ఈ సంక్రాంతి ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆకాంక్షించారు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారని, సంక్రాంతి తెలుగువారి అతిపెద్ద పండగని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పండగ ప్రజలందరికీ మధుర స్మృతులను మిగుల్చుతుందని చెబుతూ జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు.

అంతకాపల్లిలో భోగి మంటల్లేవ్..

రాజాం రూరల్ , జనవరి 13: భోగ భాగ్యాలనిచ్చే భోగి పండగను పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జరుపుకోవడం దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. పదిరోజుల ముందే చిన్నారులు భోగి పిడకలు తయారు చేస్తారు. అలాగే భోగి మంటలు వేసేందుకు కలప సేకరిస్తారు. ఇంతటి ఆహ్లాదకరమైన సందడి వాతావరణానికి రాజాం మండలం అంతకాపల్లి గ్రామస్థులు కొన్ని దశాబ్దాలుగా దూరంగా ఉంటున్నారు. సుమారు వందేళ్ల క్రితం గ్రామంలో నిర్వహించిన భోగి మంటల్లో పిల్లి పడి మరణించిందన్న ఒకే ఒక్క కారణంతో తర్వాత ఏడాది నుంచి గ్రామంలో వేడుకలు నిలిపివేశారు. కొత్తతరం యువత సైతం తాతతండ్రులు అనుసరించిన విధానానికి గౌరవమిస్తూ వేడుకలకు దూరంగా ఉండడం విశేషం.

వద్దే వద్దు

- ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇస్తే సహకరించం
- అవసరమైతే పదవులు, పార్టీకీ రాజీనామా
- తేల్చిచెప్పిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు
- సీఎం జగన్‌కు పంపేందుకు సంతకాలతో తీర్మానం
- స్థానిక సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో సమావేశం



తీర్మానాన్ని చదువుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు

శృంగవరపుకోట, జనవరి 13: "ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు ఈసారి టిక్కెట్ ఇవ్వొద్దు.. టిక్కెట్ ఆయనకే ఇస్తే ఓటమి తప్పదు.. నియంతలా వ్యవహరిస్తున్నారు.. కక్ష పెట్టుకుంటారు.. ప్రశ్నిస్తే భయపెడతారు" స్థానిక ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు, నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేసిన అభిప్రాయాలివి. నియోజకవర్గ పరిధిలోని శృంగవరపుకోట, వేపాడ, కొత్తవలస, జామి, ఎల్.కోట మండలాలకు చెందిన వారంతా స్థానిక సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో శనివారం ఉదయం 11గంటల సమయంలో సమావేశమయ్యారు. అందరూ కలిసి ఒక్కటే కోరారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇవ్వొద్దన్నారు. ఎమ్మెల్యేతో ఇన్నాళ్లు పడిన బాధలను వెళ్లగక్కారు. ఆయనకు మళ్లీ టిక్కెట్ ఇస్తే పనిచేయబోమని, పదవులకు, పార్టీకి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ఈమేరకు సీఎం జగన్‌కు పంపించేం దుకు సంతకాలతో కూడిన తీర్మానం చేశారు. ఎస్.కోట ఎంపీపీ సండి సోమేశ్వరరావు తీర్మానాన్ని చదవి వినిపించారు.

'2019 సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని సమీకరణాల రీత్యా వేరొక నియోజకవర్గానికి చెందిన కడుబండి శ్రీనివాసరావుకు ఎస్.కోట అభ్యర్థిగా టిక్కెట్ ఇచ్చారు. ఆయన గురించి ఏమీ తెలియకపోయినా మేమంతా కష్టపడి టీడీపీకు కంచుకోటగా ఉన్న ఎస్.కోట నియోజకవర్గంలో అతన్ని గెలిపించాం. కానీ ఆయన ఎవరినీ గౌరవించడం లేదు. దుర్భాష మాట్లాడుతున్నారు. ఇబ్బందులు పెడుతున్నారు. మా సమస్యలు పరిష్కరించవద్దంటూ ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. ఈవిషయం అడిగితే అవమానించడంతో పాటు అవహేళన చేస్తున్నారు. నియంతలా వ్యవహరిస్తున్నారు. మరో ఐదేళ్లు ఇబ్బందులు, అవమానాలతో రాక్షస పాలన భరించే దుస్థితి మాకు వద్దు. ఆయనకు మళ్లీ టిక్కెట్ ఇస్తే నియోజకవర్గంలో పార్టీ ఓటమి చెందడమే కాక విశాఖ లోక్‌సభ స్థానంపైనా ప్రభావం పడుతుంది. కాబట్టి కడుబండికి టిక్కెట్ ఇవ్వొద్దు' అంటూ చేసిన తీర్మానంపై 139 ప్రజా ప్రతినిధులు, నామినేటెడ్ పదవులు పొందిన నేతలు, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు సంతకాలు చేశారు. కడబండి వద్దు, సీఎం ముద్దు అంటూ నినాదాలు చేశారు. విశాఖ ఎంపీగా పోటీచేయనున్న బొత్స ఝాన్సీలక్ష్మి గెలవాలంటే కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. అప్పటికీ అధిష్టానం పెడచెవిన పెడితే ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహిస్తామని స్పష్టంచేశారు. అయినప్పటికీ ఆయనకే టిక్కెట్ ఇస్తే రాజీనామాలు చేయకతప్పదని హెచ్చరించారు. వేపాడ వైస్‌ఎంపీపీ అడపా ఈశ్వరరావు, నాయకులు మెరపల సత్యనారా యణ, మోపాడ గౌరినాయుడు, భోజంకి గోవింద, కె.వెంకటరావు, బీఎస్ఎన్ పాత్రుడు, పెంటాజీ, కనకరాజు, బూసాల దేముడు పాల్గొన్నారు.

నియంతలా వ్యవహరిస్తున్నారు

ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నన్ను ప్రజా ప్రతినిధిగా చూడడం లేదు. కనీసం సాటి మనిషిగా గుర్తించలేదు. పలుమార్లు అవమానించారు. అవహేళన చేశారు. తానొక ఎమ్మెల్యేను అని, తాను చెప్పిందే జరుగుతుంటూ నియంతలా వ్యవహరిస్తున్నారు. వ్యక్తిగత దూషణలకు, కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు.

- సండి సోమేశ్వరరావు, ఎంపీపీ, ఎస్.కోట

అడిగితే భయపెడుతున్నారు

జడ్పీటీసీగా 17వేల మేజార్టీతో గెలిచాను. ఎమ్మెల్యే కనీస గౌరవం ఇవ్వడం లేదు. ప్రొటో కాల్ పాటించరు. ఏడాదిగా పలుమార్లు అధి ష్టానం దృష్టిలో పెట్టాం. మార్పు లేదు. నా సొం త గ్రామమైన వీరనారాయణంలో జరిగిన కార్య క్రమం సమాచారం ఇవ్వలేదు. అడిగితే భయపె డుతున్నారు. ఇతనికి టిక్కెట్ ఇస్తే పదవికి రాజీనామా చేస్తాను.

- ముమ్మాలూరి వెంకట లక్ష్మి, జడ్పీటీసీ, శృంగవరపుకోట

టిక్కెట్ ఇస్తే ఓటమే

ఎస్టీ మహిళను. మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా గెలిచాను. ఎమ్మెల్యే ఏ కార్యక్రమం చేపట్టినా సమాచారం ఉండదు. ఎమ్మెల్యే వస్తున్నారంటూ కార్యక్రమానికి ముందు వలంటీర్లతో వీధివీధిలో చెప్పించుకుంటారు. ఏ సమస్య చెప్పినా స్పందించరు. రిజర్వేషన్ వుంది కాబట్టి సర్పంచ్ అయ్యావంటారు. మళ్లీ ఆయనకే టిక్కెట్ ఇస్తే ఓటమే.

- సంతోషికుమారి, సర్పంచ్, శృంగవరపుకోట

కక్ష పెట్టుకున్నారు

ఎంపీపీను చేస్తానంటే కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో ఎంపీటీసీగా డబ్బులు ఖర్చుపెట్టి మా కోడలను గెలిపించాను. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ అధ్యక్షుని ఎంపికకు రికమండేషన్ లేటర్ అడిగినా ఇవ్వలేదు. నా పలుకుబడితో నలుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ రికమండేషన్ లేటర్‌లు సంపాదించుకుని పదవిని పొందాను. దీంతో నాపై మరింతగా ఎమ్మెల్యే కక్ష పెంచుకున్నారు.

లెంక రామన్న పాత్రుడు, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ అధ్యక్షుడు, కొత్తవలస

మళ్లీ టిక్కెట్ ఇస్తే పనిచేయను

కడుబండి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా గెలిచిన రెండు నెలల నుంచి ఇబ్బందులు మెదలయ్యాయి. జగ్గయ్యపేట గ్రామ సర్పంచ్‌గా పోటీ చేశాను. నామినేషన్ వేసేందుకు వెళ్లే సమయంలో అంతవరకు టీడీపీలో వున్న ప్రత్యర్థులకు వైసీపీ కండువాలు కప్పారు. నా ఓటమికి కారణమయ్యారు. నెడ్‌క్యాప్ డైరెక్టర్ పదవికి అడ్డుతగిలారు. ఇతనికి టిక్కెట్ ఇస్తే పనిచేయను.

- చలుమూరి పద్మ, నెడ్‌క్యాప్ రాష్ట్ర డైరెక్టర్, వేపాడ మండలం

టిక్కెట్ ఇస్తే ఓడిస్తాం

ఎంపీటీసీ, సర్పంచ్‌గా పనిచేశాను. గత స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీ టిక్కెట్ ఇస్తానని చెప్పారు. ఆఖరి నిమిషంలో టిక్కెట్ ఇవ్వలేదు. టీడీపీ నుంచి పార్టీలో చేరిన వ్యక్తికి కట్టబెట్టారు. సర్పంచ్ ఎన్నికల్లోను ఇదే విదంగా ప్రత్యర్థికి లోపాయికారీగా సహకారం అందించారు. ఇతనికే మళ్లీ టిక్కెట్ ఇస్తే ఓడిస్తాం.

- దుల్ల వెంకటరావు, మాజీ ఎంపీటీసీ, అరిగిపాలెం, వేపాడ

టిక్కెట్ ఇవ్వొద్దని చెప్పాం

స్థానికేతరుడైన కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇవ్వొద్దని అధిష్టానం పెద్దలందరికి చెప్పాం. గత ఎన్నికల్లో వున్న ప్రత్యేక పరిస్థితుల్లో అధిష్టానం చెప్పినట్లు విన్నాం. టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టాం. తిరిగి ఇతనికే మళ్లీ టిక్కెట్ ఇస్తే పని చేసేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. ఎట్టిపరిస్థితుల్లోను టిక్కెట్ రానివ్వం

- మేలాస్త్రీ అప్పారావు, వైస్ ఎంపీపీ భర్త, కొత్తవలస

త్వరలో బదిలీలు

- అధికారులను వేరే జిల్లాలకు పంపించనున్న ఈసీ
- జాబితా సిద్ధం చేయాలని ఆదేశం



కలెక్టరేట్, జనవరి 13: సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలువురు అధికారులు బదిలీ కానున్నారు. ఉన్నతాధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలను వేరే జిల్లాలకు ఎన్నికలు కమిషన్ బదిలీ చేయనుంది. ఇందుకోసం జిల్లాలో కసరత్తు జరుగుతోంది. మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న వారి వివరాలతో పాటు, సొంత జిల్లాకు చెందిన అధికారుల వివరాలను అందజేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఆయా అధికారుల వివరాలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో భూసేకరణ యూనిట్-1 డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సుదర్శన దొర సొంత జిల్లా విజయనగరం కావడంతో ఆయనకు బదిలీ జరిగే అవకాశం ఉంది. జిల్లాకు కొత్తగా బదిలీపై వచ్చిన నలుగురైదుగురు తహసీల్దార్లు మినహా మిగిలిన వారంతా పక్క జిల్లాలకు బదిలీ కానున్నారు. కలెక్టరేట్‌లో పని చేస్తున్న పలువురు సెక్షన్ పర్యవేక్షకులు, ఆర్డీవో కార్యాలయాల పరిపాలన అధికారులు, కేఆర్‌సీసీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు కూడా బదిలీ కానున్నారు. ఈనెల 22న ఓటర్ల తుది జాబితా విడుదల కానుంది. 25న జరగనున్న జాతీయ ఓటర్ల దినోత్సవం తరువాత అధికారుల బదిలీలు ఉండే అవకాశం ఉంది.

రూ.25లక్షలకు టోకరా

- పప్పుల చీటీ పేరుతో మోసం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

జామి, జనవరి 13 : జామి బీసీ కాలనీకి చెందిన 513మంది బాధితులు పప్పుల చీటి కట్టి మోసపోయారు. వీరినుంచి రూ.25లక్షలు సేకరించిన స్థానిక మహిళ విజయనగరంలోని ఓ వ్యక్తికి ఆ డబ్బులివ్వగా అయన మొండిచేయి చూపడంతో పాటు పరారయ్యాడు. ఘటనపై శనివారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏడాదిగా బీసీకాలనీకి చెందిన అల్లాడి సీత వద్ద పప్పుల చీటీ కడుతున్నారు. నెలకు రూ.350 చొప్పున 513 మంది చెల్లించారు. అదేవిదంగా నెలకు రూ.వెయ్యి చొప్పున వరలక్ష్మి చీటీ పేరుతో మరో 50మంది కూడా డబ్బులు చెల్లించారు. వీరందరికీ సంక్రాంతి ముందు డబ్బులకు సరిపడే నిత్యావసర వస్తువులు ఇవ్వాల్సి ఉంది. దాదాపు రూ.25లక్షలతో విజయనగరానికి చెందిన ఆ వ్యక్తి పరారయ్యాడు. స్థానికంగా ఉండే సీతను ఏజెంట్‌గా నియమించుకుని డబ్బులు రాబెట్టాడు. చివరకు అందరినీ మోసం చేశాడు. ఆగ్రహంతో ఉన్న బాధితులు శనివారం అమె ఇంటికి వెళ్లి వాదనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వీరబాబు ఫిర్యాదుచేస్తే కేసు నమోదుచేస్తామని చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు. పప్పుల చీటీ పేరుతో మోసపోతున్న ఘటనలు ఏటా సంక్రాంతి సమయంలో వెలుగులోకి వస్తున్నాయి. గత ఏడాది కూడా చాలా గ్రామాల్లో వేలాది మంది డబ్బులు చెల్లించి పోగొట్టుకున్నారు. పండగకు ఆర్థిక భారం తగ్గుతుందన్న పేద వారి ఆలోచనను అక్రమార్కులు స్వార్థానికి వాడుతున్నారు.

వనమిత్ర కేంద్రాల అభివృద్ధికి చర్యలు

అటవీశాఖ అదనపు చీఫ్ కన్జర్వేటర్ రాహుల్‌పాండ్యా



బొండపల్లి, జనవరి 13: వనమిత్ర కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ (సీసీఎఫ్) రాహుల్ పాండ్యా చెప్పారు. బొండపల్లి మండల కేంద్రంలోని వనమిత్ర కేంద్రాన్ని శనివారం అయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వనమిత్ర కేంద్రాల్లో రైతులకు అవసరమైన వివిధ రకాల మొక్కలను పెంచుతున్నామన్నారు. తాటిపూడి రిజర్వాయర్‌లో అన్ని సౌకర్యాలను సమకూర్చి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అనంతరం వనమిత్ర కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అటవీశాఖాధికారి ఎస్.వెంకటేష్, ఎస్ఆర్‌వో జేజీ.సింధూ, ఎఫ్ఎస్‌వో ఎన్‌డి.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న కర్నూలు న్యాయాధికారి ప్రతిభాదేవి

పార్వతీపురంటౌన్: విద్యాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కర్నూలు జిల్లా న్యాయాధికారి ప్రతిభాదేవి అన్నారు. శనివారం పట్టణంలోని సంస్కృతోన్నత పాఠశాలలో గొట్టాపు వెంకటతిరుపతిరావు జ్ఞాపకార్థం పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన పాఠశాల అభివృద్ధికి తమ కుటుంబం తరపున పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖ వైద్యుడు రామ్మోహనరావు, ప్రతిమాదేవి, దంపతులతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.శ్రీరాములు, వి.నరహర శాస్త్రి, కె.రవికుమార్, హెచ్ఎం హేమసుందరరావు, సంస్కృత పండితులు తిరుమలాచార్యులు, ఉపాధ్యాయులు గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు



బొండపల్లి: కనిమెరకలో అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

బొండపల్లి: కనిమెరక గ్రామంలో అయోధ్య రామునికి సంబంధించిన అక్షింతలను శనివారం ఘనంగా ఊరేగించారు. గ్రామస్తులకు వాటిని పంచిపెట్టారు. ఈ నెల 22న రామాలయ ప్రతిష్ఠలో భాగంగా ప్రతి ఇంటికీ అక్షింతలను అందజేసి.. పూజా కార్యక్రమాలను నిర్వహించాలని భక్తులను నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. **సాలూరు రూరల్:** అయోధ్య బాలరాముని అక్షింతలను శనివారం సాలూరు గొల్లవీధిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రామమందిరం చిత్రపటాన్ని ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22న సాయంత్రం ప్రతి ఇంటి ముంగిట 11 రామజ్యోతులను వెలిగించాలని నిర్వాహక కమిటీ ప్రతినిధి నాలి చంద్రశేఖర్ కోరారు.

కామాక్షి అమ్మవారికి పుష్పాలంకరణ



సాలూరు రూరల్: సంక్రాంతి ఉత్తరాయణ పుణ్యకాలం నేపథ్యంలో శనివారం సాలూరులో కామాక్షి అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. అమ్మవారికి అర్చన, అభిషేకం తదితర కైంకర్యాలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కరెంట్ కోతలతో ఇక్కట్లు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర



మాట్లాడుతున్న విజయచంద్ర

బెలగాం, జనవరి 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలు ఎక్కువయ్యాయని.. సంక్రాంతి పండగ మూడు రోజులైనా కోతలు లేకుండా చూడాలని టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇంచార్జి బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సానిక మెయిన్ రోడ్డులో విద్యుత్ సరఫరా లేకపోవడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారని విజయచంద్ర విలేకరులతో అన్నారు. సంక్రాంతి సందర్భంగా పిండి మరల వద్ద కాపలాకాయాల్సి వచ్చిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. తాగునీటి సరఫరా పట్టణంలో ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. విద్యుత్ కోతలు లేకుండా, తాగునీటికి ఇబ్బంది లేకుండా సరఫరా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, దాలి నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామునాయుడు చిరస్మరణీయుడు



దహన వాటికను ప్రారంభిస్తున్న బంగార్రాజు, ఆనంద్‌కుమార్

నెల్లిమర్ల: జరజాపుపేటకు చెందిన టీడీపీ నేత స్వర్గీయ బొలే రామునాయుడు చిరస్మరణీయుడు అని నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. రామునాయుడు స్మారకార్థం ఆయన కుమారులు ఆ గ్రామంలోని శ్మశాన వాటికలో సొంత ఖర్చుతో నిర్మించిన దహన వాటిక (బీడ్ బెడ్) భవనాన్ని బంగార్రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బంగార్రాజు మాట్లాడారు. తండ్రి స్మారకార్థం గ్రామస్తులకు ప్రయోజనం కలిగించే సేవా కార్యక్రమం చేపట్టిన కుమారులు ధన్యులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, టీడీపీ నగర పంచాయితీ ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ, రామునాయుడు కుమారులు రమణారావు, శంకరరావు, త్రినాథరావు, పార్టీ నాయకులు కాళ్ల రాజశేఖర్, కాళ్ల సత్యవతి, మద్దిల శ్రీను, రాంబాబు, సత్యనారాయణ, గోపి, నల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగులకు నగదు పంపిణీ

కొమరాడ: మండల వనరుల కేంద్రంలో విధులు నిర్వ హిస్తున్న ఎస్ఎస్ఏ సిబ్బందికి, కేజీబీవీ ఒప్పంద ఉద్యోగులకు రూ.6,500 చొప్పున ఎంఈవో జామి నారాయణస్వామి పంపిణీ చేశారు. గత నాలుగు నెలలుగా వీరికి వేతనాలను ప్రభుత్వం చెల్లించడం లేదు. దీంతో పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సంఘాలు.. ఎస్ఎస్ఏ సిబ్బందికి నిధులను సమకూర్చాయి. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు వీవీజీ రాజు, కార్యదర్శి వెంకటరమణ, పీఆర్ టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు గౌరీశంకర్‌స్వామినా యుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి రాక రేపు

సీతంపేట: కేంద్ర మంత్రి అర్జునరామ్‌మిజ్వాల్ సోమవారం ఐటీడీఏకు రానున్నట్టు అధికారులకు వర్తమానం అందింది. ప్రధానమంత్రి జన్‌మాన్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొనున్నారని, దీనికి సంబంధించి ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వులు అందాయి.

రైస్ మిల్లుపై క్రిమినల్ కేసు

పార్వతీపురం(ఆంధ్రజ్యోతి): పాలకొండలోని సత్యనారాయణ మోడరన్ రైస్‌మిల్లుపై పోలీసులు శనివారం క్రిమినల్ కేసు నమోదు చేశారు. జియ్యమ్మవలస మండలం అలమండ గ్రామానికి చెందిన డొల్లు సతీష్ తన ధాన్యాన్ని పట్టుకొని శుక్రవారం ఈ మిల్లుకు వెళ్లగా 62 కిలోలు అదనంగా ఇవ్వాలని యజమాని డిమాండ్ చేశాడు. దీంతో సతీష్ తప్పనిసరి పరిస్థితుల్లో ధాన్యంకు బదులు నగదును మిల్లు యజమానికి ఫోన్‌పే చేశాడు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎండీ నాయక్ పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో మిల్లుపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్రిమినల్ కేసు నమోదు చేశారు. సతీష్ చెల్లించిన నగదును తిరిగి ఇప్పించారు. రైతుల నుంచి ఒక్క ధాన్యం గింజ అదనంగా తీసుకున్న చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఎవరైనా అదనంగా ధాన్యం అడిగితే జిల్లా కంట్రోల్ రూం నెంబర్ 08963293037, 7702003582, కలెక్టర్ సీసీ ఫోన్ నెంబర్ 8333813243కు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

'పల్లె పిలుస్తోంది రా' కరపత్రం విడుదల

పార్వతీపురం(ఆంధ్రజ్యోతి): పల్లె పిలుస్తోంది రా అనే కరపత్రాన్ని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష శనివారం తన కార్యాలయంలో విడుదల చేశారు. నాయకులు జి.రవికుమార్, కోలా వెంకటరావు, జాగాన రవిశంకర్ పాల్గొన్నారు.



డెంకాడ: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



శృంగవరపుకోట: న్యాయవాది రమణాజీ వద్ద సంతకం సేకరిస్తున్న అంగన్‌వాడీలు



రాజాం రూరల్: సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

● ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ● సంతకాల సేకరణ

ఉమ్మడి జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మెను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, హామీలు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 33వ రోజుకు చేరుకుంది. వివిధ చోట్ల వినూత్నంగా నిరసన తెలిపారు. జగనన్నకు చెబుదాం పేరిట కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. -ఆంధ్రజ్యోతి బృందం



పాలకొండ: బుక్కూరులో సంతకాల సేకరణ..



రామభద్రపురం: ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



పాలకొండ: లుంబూరులో సంతకాలు సేకరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు

టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దాం

పార్వతీపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేద్దామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. శనివారం అడ్డాపుశీల పంచాయతీ పీఆర్ఎస్‌వలసకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారందరికీ టీడీపీ కండువా వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నాయకులు బోనుదేవి చంద్ర మౌళి, బార్నాల సీతారాం, జి.చంద్రమౌళి, సత్యనారాయణ, వెంకటనాయుడు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో విజయచంద్ర

ఓటు హక్కు వినియోగించుకోండి



పల్లె పిలుస్తోంది రా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి అన్నారు. 'పల్లె పిలుస్తోంది రా' కార్యక్రమం పోస్టర్‌ను శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు సంక్రాంతికి స్వగ్రామాలకు చేరుతున్నారని చెప్పారు. వీరికి రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని చెప్పడం, ఓట్లు ఉన్నాయో లేవో చూసుకోమనడం, ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. నాయకులు గొర్లె కిషోర్, జేవీ రమణ, కార్తీక్‌నాయుడు, పోలూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని సాగనంపుదాం

● టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందాం ● మాజీ మంత్రి అరుణ

జియ్యమ్మవలస: ఒక్క అవకాశమంటూ గద్దెనెక్కి, గాలి మాటలతో ప్రజలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపుదామని మాజీ మంత్రి, జనసేన పార్టీ ఏపీసీ సభ్యురాలు పడాల అరుణ పిలుపునిచ్చారు. శనివారం జియ్యమ్మవలసలో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జగన్ పాలనలో అభివృద్ధి ఊసే లేదన్నారు. వైసీపీని ప్రజలు నమ్మవద్దని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని, దీనికోసం జనసేన కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిపై తీవ్ర విమర్శలు చేశారు. టిక్ టాక్ ఎమ్మెల్యేగా పేరు సంపాదించిన ఈమె సెల్ఫీల కోసమే అసెంబ్లీకి వెళ్తున్నారే తప్ప ఏనాడైనా కురుపాం నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించి పరిష్కారం చూపారా అని ప్రశ్నించారు. ఇలాంటి వారికి ప్రజలు మరో అవకాశం ఇవ్వొద్దన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముందుగా పెదమేరంగి జంక్షన్ నుంచి మండల కేంద్రం వరకు బారీ ర్యాలీని నిర్వహించారు. జనసేన పార్టీ విజయనగరం జిల్లా సమన్వయకర్త లోకం మాధవి, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు గేదెల రిషివర్ధన్, కడ్రక మల్లేశ్వరరావు, నిమ్మక నిబ్రహం, పలు మండలాల కోఆర్డినేటర్లు, ఐటీ కోఆర్డినేటర్లు, అధిక సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జనసేన జెండా ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పడాల అరుణ, తదితరులు

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

చీపురుపల్లి: స్థానిక శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్, ఈఓ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం భోగి మంటలు వేస్తామన్నారు. కోలాటం ప్రదర్శన ఉంటుందన్నారు. సోమవారం సంక్రాంతి రోజున రంగవల్లుల పోటీలు, మంగళవారం కనుమ నాడు గోపూజ ఉంటాయని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గజపతినగరం: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ ఎన్.వి. ప్రభాకర్ అన్నారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ఎక్కడ ఎటువంటి అసాంఘిక కార్యక్ర మాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. పండగకు ఊళ్లకు వెళ్లిన వారు పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.

పీఎం జన్‌మాన్‌లో పీవీటీజీల శతశాతం నమోదు లక్ష్యం: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పాచిపెంట, జనవరి 13: ప్రధానమంత్రి జన్‌మాన్‌లో పీవీటీజీల శత శాతం నమోదు లక్ష్యంగా చర్యలు చేపట్టామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. శనివారం పనుకువలస గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీవీటీజీలు అభివృద్ధికి దూరంగా ఉన్నారని, వీరికోసం కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మాన్ అమలు చేస్తోందన్నారు. ప్రతీ పీవీటీజీకి ప్రతి పథకం అందాలని నిర్ణయించిందని చెప్పారు. ప్రతిఒక్కరూ ఉజ్వల యోజనలో నమోదు కావాలని సూచించారు. దీనివల్ల ఏడాదికి 12 సిలిండర్లు 30 శాతం రాయితీపై లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, ఎంపీపీ బి.ప్రమీల, వైస్‌ఎంపీపీ ఎం.నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

విరాళాలతో మాస్టర్ కుటుంబానికి ఇల్లు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ విరాళాలు సేకరించి గుమ్మలక్ష్మీపురంలో దివంగత రవి మాస్టర్ కుటుంబానికి ఇల్లు నిర్మిస్తోంది. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. సుమారు రూ.1.30లక్షల విరాళాలు సమకూర్చి శనివారం ఇంటికి శ్లాబు వేశారు. సర్పంచ్ గౌరీ శంకరరావు, వైశ్య సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్, సామాజిక కార్యకర్త యర్నాకుల నాగరాజ్ పాల్గొన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌కు చీపురుపల్లి విద్యార్థులు

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం, కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ, అణుశక్తి, అంతరిక్ష పరిశోధన శాఖలు సంయుక్తంగా నిర్వహించనున్న అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు చీపురుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 17 నుంచి 20 వరకూ ఈ ఉత్సవాలు హర్యానాలోని ఫరీదాబాద్‌లో జరగనున్నాయి. ఈ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎంఆర్ గాయత్రీ దేవి, జేఎఎస్ శ్రీవిద్య ఎస్.సుప్రియ, డి.పార్థసారథి, టీవీఎం సూరజ్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు అవకాశం దక్కించుకున్నారు. వీరికి గైడ్‌గా జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మిరియాల కృష్ణారావు వ్యవహరిస్తున్నారు. ఈ విద్యార్థులను డీఈఓ బి.లింగేశ్వర్‌రెడ్డి, ఉప విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు, హెచ్ఎం కె.చంద్రశేఖర్ కుమార్ తదితరులు అభినందించారు.



అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైన విద్యార్థులు

రామాలయానికి విరాళం

భోగాపురం: అల్తిపాలెంలో రామాలయ నిర్మాణానికి నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు శనివారం రూ.50 వేల విరాళం అందజేశారు పోలిపల్లిలోని ఆయన స్వగృహం వద్ద కమిటీ సభ్యులకు ఈ మొత్తం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ముడి సూర్యనారాయణ, భాస్కరరావు, పాపారావు, సత్యనారాయణ తదిత రులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకే మొదట ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. శనివారం మరుపెంట, కొత్తూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా పలు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం లో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, డాక్టర్ ఎస్.సంతోష్‌కుమార్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జూదం, కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

● సీఐ వెంకటేశ్వరరావు

భోగాపురం, జనవరి 13: భోగాపురం, నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో కోడిపందాలు, జూదం నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ బీవీ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతిని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. ఎక్కడైనా జూదం, కోడిపందాలు నిర్వహిస్తే ప్రజలు సమాచారం అందించాలని కోరారు.

ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

గంట్యాడ: గంట్యాడ ఎస్ఐగా బి.సురేంద్రనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రామభద్ర పురం ఎస్ఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ కిల్లారి కిరణ్ కుమార్ నాయుడు చీపురుపల్లికి బదిలీపై వెళ్లారు. ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన సురేంద్రనాయుడుకు సిబ్బంది అభినందనలు తెలిపారు. **మెరకముడిదాం:** బుదరా యివలస ఎస్ఐగా బి.లోకేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గ తంలో ఇక్కడ పనిచేసిన సీహెచ్ నవీన్ పడాల్‌కు విజయ నగరం సీసీఎస్‌కు బదిలీ అయింది. **చీపురుపల్లి:** చీపురు పల్లి ఎస్ఐగా కె.కిరణ్ కుమార్ నాయుడు శనివారం బాధ్య తలు స్వీకరించారు. ఇప్పటి దాకా గంట్యాడలో పనిచేసిన ఆయన బదిలీపై చీపురుపల్లి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎ.సన్యాసినాయుడును విజయనగరం వీఆర్‌కు పంపించా రు. బాధ్యతలు చేపట్టిన కిరణ్ కుమార్ నాయుడును సిబ్బంది అభినందించారు.

టీడీపీ గెలుపునకు పనిచేయండి

● రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ● టీడీపీలో 150 కుటుంబాల చేరిక


రాజాం: టీడీపీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

రాజాం: టీడీపీ గెలుపునకు పనిచేయాలని ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. రాజాం పురపాలక సంఘం పరిధిలో మల్లిఖార్జున కాలనీకి చెందిన 150 కుటుంబాలు వైసీపీని వీడి శనివారం పట్టణ టీడీపీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో శ్యాం పురం క్యాంపు కార్యాలయంలో టీడీపీ చేరాయి.ఈ సందర్భంగా కోండ్రు మాట్లాడుతూ వైసీపీ నియంతపాలనలో రాష్ట్రం అన్నివిధాలుగా విఫలమయ్యింద ని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పొట్నా చిట్టిబాబు, బనిశెట్టి వెంకటరావు, శాసపు రమేష్‌కుమార్, టంకాల కన్నంనాయుడు, బోనెల నారాయణరావు, కాటం శ్రీను, ఎన్.ప్రసాద్, ముగడ శ్రీనివాసరావు, టంకాల నాగరాజు, ఆటో కోటి పాల్గొన్నారు.

సిమెంట్ లెక్కలపై నిజానిజాలు నిగ్గుతేల్చాలి

రేగిడి: మండలంలో సిమెంట్ లెక్కలపై జిల్లా యంత్రాంగం నిజాలు నిగ్గుతేల్చాలని, తక్షణమే విచారణకు ఆదేశించాలని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహనరావు డిమాండ్ చేశారు. ఉప్పర నాయుడు వలసలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల సామాజిక తనిఖీలో పక్కదారిపట్టిన సిమెంట్ బస్తాలు వ్యవహారంపై జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లి విచారణకు పట్టుబడతామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం హయంలో ఇటువంటి అవకతవకలు, కుంభకోణాలు సర్వసాధారణమయ్యాయని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని ఆయన కోరారు. కాగా ఉప్పరనాయుడువలసకు చెందిన టీడీపీ మద్దతుదారుడు గొర్లి సింహాద్రినాయుడు ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట దూబ ధర్మారావు, కర్డేన మహేశ్వరరావు, కె.అశోక్ బాబు, చల్ల బుజంగరావు, పాలూరి రామినాయుడు, గొల్వి హరిబాబు, శాసపు గోవింద రావు, గురవాన ధనంజయ్ ఉన్నారు.


విజయనగరం రింగురోడ్డు: వాజీ చానల్ నిర్వహించిన పోటీలో ముగ్గులను పరిశీలిస్తున్న టీవీ, సినీ ఆర్టిస్ట్ పూజామూర్తి




కొత్తవలస/ శృంగవరపుకోట: ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు, నాయకులు

సందడిగా సంక్రాంతి సంబరాలు

● ఆకట్టుకున్న రంగవల్లులు ● అలరించిన డూడు బసవన్నలు

జిల్లాలో సంక్రాంతి సంబరాలు శనివారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీలు ఆకట్టుకున్నాయి. విజయనగరంలోని ఆనందగజపతి కళాక్షేత్రంలో వాజీ చానల్ నిర్వహించిన రంగవల్లుల పోటీలను టీవీ, సినీ ఆర్టిస్ట్ పూజామూర్తి పరిశీలించారు. కొత్తవలస, ఎస్.కోటలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల నిర్వహించారు. విజయనగరం జడ్పీ కార్యాలయం ఆవరణలో సంబరాల్లో భాగంగా భోగి మంటలు వేశారు. కోలాటం, తప్పెటగుళ్లు ప్రదర్శించారు. డూడు బసవన్నలు అలరించారు. ఉద్యోగినులు పిండి వంటలు చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం


విజయనగరం జడ్పీ కార్యాలయంలో డూడూ బసవన్నల సందడి

క్యాన్సర్ బాధితుడు ఆత్మహత్య

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం జంక్షన్‌లో గల రైల్వే గేట్ వద్ద శనివారం గ్రామానికి చెందిన ఓ క్యాన్సర్ బాధితుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. మంగళపాలెం గ్రామానికి చెందిన పి.దుర్గాప్రసాద్(50) కొద్దేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. గాజువాకలో భార్య పిల్లలను వదిలి మంగళపాలెంలో కొద్దిరోజులుగా నివాసముంటున్నాడు. క్యాన్సర్ వ్యాధి ముదరడంతో బాధను తట్టుకోలేక మంగళపాలెం జంక్షన్‌లోని పట్టాల వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

పాముకాటుతో మహిళ మృతి

మెరకముడిదాం: యాడిక గ్రామానికి చెందిన మహిళ పాముకాటుతో మృతి చెందింది. ఈ గ్రామానికిచెందిన సావు బాలమ్మ(33) శుక్రవారం తన మొక్కజొన్న పొలంలో పనిచేస్తుండగా పాము కాటు వేసింది. భర్త శ్రీను కుటుంబీకులు చీపురుపల్లి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు బుదరాయివలస పోలీసులు తెలిపారు.

చెరువులో పడి ఒకరి..

సీతానగరం: మండల కేంద్రంలోని నడిరెడ్డి చెరువులో పడి మెట్టవీధికి చెందిన గొరిపిండి వెంకటరమణ (35) మృతి చెందాడు. స్నానం కోసం వెళ్లిన వెంకటరమణ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. స్థానికులు గమనించి అతన్ని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరమణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఫైర్ ఇంజన్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

రాజాం రూరల్: రాజాం అగ్నిమాపక శాఖలో ఫైర్ ఇంజన్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న లోకేశ్వరరావు శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం ఉదయం విధులకు వచ్చిన ఆయన ఫైర్‌స్టేషన్‌లోనే కత్తితో గొంతు కోసుకుని అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పరిస్థితిని గమనించిన సిబ్బంది రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించడంతో ప్రమాదం తప్పింది. మద్యం మత్తులో విధులకు హాజరు కావడంతో అధికారులు, తోటి సిబ్బంది సున్నితంగా మందలించడంతో ఈ చర్యకు పాల్పడినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని ఫైర్ ఆఫీసర్ జనార్దనరావు వద్ద ప్రస్తావించగా డ్రైవర్‌తో పాటు ఏ సిబ్బందినీ మందలించేందుకు అవకాశాలే ఉండవన్నారు. ఇదిలా ఉంటే డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి సంబంధించి తమకు సమాచారం కూడా లేదని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై బాలుడికి గాయాలు

బొబ్బిలి: పట్టణంలోని స్వామివారి వీధిలో శనివారం అరటి చెట్టు ఆకులు కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు గాయపడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మల్లమ్మపేట గ్రామానికి చెందిన బాలుడు తెంటు అభినయ్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉన్న అరటి చెట్టు నుంచి ఆకులు కోస్తున్నాడు. అరటి ఆకులు విద్యుత్ వైర్లకు తగిలి ఉండడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అభినయ్ కిందికి పడిపోయి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. ఈ మేరకు పోలీసులు వచ్చి సమాచారాన్ని బంధువులకు తెలిపారు. అభినయ్ తండ్రి అప్పారావు, బంధువులు ఆసుపత్రికి చేరుకొని మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచనమేరకు విశాఖ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అభినయ్ పరిస్థితి విషమంగానే ఉంది. ఘటనా స్థలాన్ని విద్యుత్ అధికారులు పరిశీలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గజపతినగరం: రంగుపురంలో పేకాట శిబిరాలపై దాడులు చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్టు ట్రైనీ డీఎస్పీ మహేంద్ర శనివారం తెలిపారు. అక్కడి మామిడి తోటలో పేకాటఆడుతున్నట్లు సమాచారంతో దాడులు చేశామని తెలిపారు. వారి నుంచి రూ.3,720 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

రేగిడి: మండలంలోని చాటయివలస,పెద్దశిర్లాం సమీపంలోశనివారం వేర్వేరుగా పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. అంబాడకు చెందిన ఆరుగురిని పెద్దశిర్లాం క్వారీ సమీపంలో పేకాట ఆడుతుండగా పట్టుకుని వీరి వద్ద నుంచి రూ. 56860, చాటాయివలస వద్ద నాలుగురిని పట్టుకొని వీరి వద్ద నుంచి రూ. 20980 స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టుచేసి కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ముందురోజు రాత్రి గుళ్లపాడు వద్ద నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టుచేసి వీరి వద్ద నుంచి మరో రూ. 5310లు నగదె సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోడి పందెం రాయుళ్లు..

భోగాపురం: లింగాలవలస సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.సూర్యకుమారి శనివారం తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని మూడు కోళ్లు, రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు: సీఐ

విజయనగరం క్రైం: విజయనగరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సంక్రాంతి పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ బి వెంకటరావు హెచ్చరించారు. శనివారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ స్పెషల్ పార్టీ పోలీసులు విస్తృతంగా మఫ్టీలో తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎవరైనా పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారి సమాచారాన్ని అందించాలని, అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని గంటస్తంభం, వన్‌టౌన్ పోలీసుస్టేషన్, కోట జంక్షన్, మూడులాంతర్ల ప్రాంతాల్లో వాహనచోదకులు, ఆటో డ్రైవర్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు.

బంధువుల ఇళ్లకు వెళ్తే సమాచారం ఇవ్వండి

తెర్లాం: మండలంలో సంక్రాంతి సజావుగా జరుపుకోవాలని ఎస్ఐ రమేష్ కోరారు. గ్రామాల్లో కోడిపందేలు,పేకాట నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బంధువుల ఇళ్లకు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అక్రమంగా మద్యం విక్రయించిన వారిపై కేసులు నమోదుచేస్తామని తెలిపారు.

కొత్తపేటలో అఖండ దీపారాధన


అఖండ దీపారాధన నిర్వహిస్తున్న మహిళలు

విజయనగరం రూరల్: విజయనగరంలోని కొత్తపేట యాదవవీధిలో కోదండరామాలయ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కోదండరామాలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నారు. ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకూ ఈ కార్యక్రమం జరగనుంది. శనివారం ధనుర్మాస కార్యక్రమంలో భాగంగా అఖండ దీపారాధన నిర్వహించారు. ఉదయం ఐదుగంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయనగరం నుంచి పోటీ చేస్తా

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయనగరం నుంచి సీఎంజగన్ ఆదేశిస్తే పోటీచేస్తానని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు బి.కాంతారావు యాదవ్ తెలిపారు. శనివారం విజయనగరంలో కేఆర్ హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు బియ్యం,సామగ్రిని పంపిణీచేశారు.అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో40వేలకుపైగా యాదవసామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారని, వారి మద్దతు తనకే లభిస్తుందని చెప్పారు. కాగా తాను పోటీచేస్తానని బి.కాంతారావు పేర్కొనడం నగరంలో హట్‌టాపిక్‌గా మారింది.

వాలీబాల్ విజేత గులివిందాడ


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

కొత్తవలస: కొత్తవలసలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గులివిందాడ విజయం సాధించింది. సంక్రాంతి పురస్కరించుకుని కొత్తవలసలోని వసంత్ విహార్ యూత్, తుమ్మికాపల్లిలోని ఫర్‌ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యంతోపాటు ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీలకు మండలంలో 22 జట్లు హాజరు కాగా గులివిందాడ, వడ్డిపేట, దెందేరు గ్రామాలకు జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించడంతో పది, ఎనిమిది, ఐదు వేల రూపాయల చొప్పున నగదు బహుతులను ఎమ్మెల్సీ రఘువర్మ, శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి, వసంత్ విహార్ అధినేత వల్లూరి జయప్రకాష్‌బాబు అందజేశారు. కార్యక్రమంలో ఫర్‌ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వి. హరి కుమార్ పాల్గొన్నారు.

భోగి మంటలకు ఏర్పాట్లు


కృష్ణాపురంలో భోగిమంటల కోసం సిద్ధం చేసిన పిడకలు

బొబ్బిలి: బొబ్బిలిలో భోగి మంటల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణాపురంలో శ్రీచైతన్య సేవా సంఘం అధ్యక్షుడు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకుడు చుక్క శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిన్నారులతో వేలాది పేడ పిడకలతో దండలను తయారు చేశారు. వాటిని ఆదివారం వేకువజామున బోగిమంటలో వేయనున్నారు. కాలగమనంలో పురాతన సంప్రదాయాలు మరుగున పడకుండా ఉండేందుకు నేటి తరం బాలలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను చాటి చెబుతున్నామని శ్రీనివాసరావు తెలిపారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

● బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోంరాంబాబు


మాట్లాడుతున్న సోంరాంబాబు

దాసన్నపేట: బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ వంటి మనువాద పార్టీలతో రాజ్యాంగానికి ముప్పు పొంచిఉందని, కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి బహుజనుడిపై ఉందని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోంరాంబాబు తెలిపారు. శనివారం విజయనగరంలోని కంటోన్మెంట్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బీఎస్పీ అధినేత మాయావతి జన్మదినం పురస్కరించుకుని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దళిత, గిరిజనులపై దాడులకు పాల్ప డుతోందని ఆందోలన వ్యక్తంచేశారు. బహుజనులకు రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కేవీ రమణ, కారు గౌరి, ఆర్‌జే రెడ్డి పొట్నూరు శ్రీను, పోడుగు శంకరావు, సోమురమేష్, మణ్యాల రాము పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సకాలంలో ఇవ్వండి

బాడంగి: ఎరుకులపాకల గ్రామంలో రేషన్ బియ్యం సకాలంలో ఇవ్వకపోవడంతో గ్రామస్థులంతా ఎంపీటీసీ, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఆధ్వర్యంలో శనివారం ఖాళీ సంచులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ బియ్యం సకాలంలో ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంక్రాంతి పండగ వచ్చినా... రేషన్ బియ్యం ఇంకా రానందున ఎదురు చూస్తున్నామన్నారు. మా గ్రామానికి ప్రతి నెల ఇదే పరిస్థితి ఎదురవుతోందన్నారు. నెల ఆరంభంలో అందించవలసిన రేషన్ సరుకులు నెల చివరిదాకా ఇవ్వడం లేదన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతి సంక్రాంతికి చంద్రన్న కానుక పేరుతో బియ్యంతోపాటు ఇతర వంట సరుకులు కూడా ఇచ్చేవారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పండగ సరుకులు కాదుకదా తినడానికి బియ్యం కూడా లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న లలితకుమారి

శృంగవరపుకోట: సీతంపేటలో క్రికెట్ పోటీలను మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం ప్రారంభించారు. 50 మంది క్రీడాకారులకు టీ షర్టులను అందించారు కార్యక్రమంలో నానిగిరి రమణాజీ, మల్లేశ్వరరావు, కాళిదాసు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం: ఎస్ఐ

రామభద్రపురం: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన కొత్త ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తానన్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ బి.సురేంద్రనాయుడు బదిలీపై గంట్యాడకు వెళ్లారు.

కల్లేపల్లిలో డీ పట్టాల పరిశీలన

లక్కవరపుకోట: కల్లేపల్లిలో శనివారం రైతుల డీపట్టాలను తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి పరిశీలించారు. గతంలో ప్రభుత్వం పేద రైతులకు భూములను పంపిణీ చేసి పట్టాలు అందజేసింది. నేటికీ రైతులు తమ భూములను సాగచేస్తూ అనుభవిస్తున్నారు. కాలక్రమంలో కొంతమంది పట్టాలు పోయాయి.వీటన్నింటిని తహసీల్దార్, సిబ్బంది పరిశీలించారు. సుమారు 70 మంది రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను తహసీల్దార్‌కు సమర్పించారు. ఆధారాలన్నీ సరిగా ఉంటే కొత్తపట్టాలు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోగాడ ముసలినాయుడు, ఆర్ఐ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

కుటుంబాలన్నీ ఐక్యంగా ఉండాలి

● శిష్టకరణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు


ఈశ్వరరావును సన్మానిస్తున్న సంఘ నాయకులు

విజయనగరం: సామాజిక కుటుంబాలన్నీ ఐకమత్యంగా ఉండాలని శిష్టకరణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు కోరారు. శనివారం గరివిడి మండలంలోని శిష్టకరణాల కల్యాణ మండపంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న శిష్టకరణ కుటుంబాలకువస్త్రాలు అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ హక్కులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్.ఆనంద్ పట్నాయక్, ఉపాధ్యక్షుడు ఎల్.ప్రభాత్ కుమార్, గరివిడి సంఘ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, కార్యదర్శి కొట్టు రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు వి.వెంకటేష్, వ్యవస్థాపకుడు పీవీ రమణ తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు బండి లాగుడు పోటీలు

బొబ్బిలి: బాడంగి మండలంలోని గజరాయునివలసలో ఆ గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఎడ్లతో బండి లాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఉత్తమంగా బండి లాగిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేయనున్నారు. అలాగే ముగ్గుల పోటీలు, జానపద సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

బాడంగి: మండలంలోని రావివలసలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు భూమిపూజ చేశారు. కార్యకర్మంలో శంబంగి వేణు, పూడి ఆనంద్, మరిపి శంకరరావు, బొమ్మినాయని వెంకటనాయుడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా రంగనాథం

విజయనగరం క్రైం : విజయనగరం ట్రాఫిక్ సీఐగా పైడి రంగనాథం శనివారం పద్మావతి నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. 2002 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన రంగనాథం గతంలో గజపతినగరం, నీలకంఠాపురం తదితర పోలీస్‌స్టేషన్‌లో పనిచేశారు. సీఐగా పదోన్నతి పొందిన తర్వాత అనకాపల్లి జిల్లా సబ్బవరం సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన రంగనాథానికి డీఎస్పీ విశ్వనాథ్‌తో పాటు ఎస్ఐలు, సిబ్బంది అభినందించారు.

వంగర ఎస్ఐగా జనార్దన్

వంగర: వంగర ఎస్ఐగా వైవీజనార్దన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో పనిచేసిన ఎస్ఐ విశాఖ బదిలీకావడంతో ఆయన స్థానంలో ఇక్కడ జనార్దన్ నియమితులయ్యారు.

ఎల్.కోట ఎస్ఐగా గోపాలరావు

లక్కవరపుకోట: ఎల్.కోట నూతన ఎస్ఐగా రొంగలి గోపాలరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయనగరం వన్‌టౌన్ నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ముకుందరావు బదిలీపై అనకాపల్లి వెళ్లారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకి సిబ్బంది అభినందించారు.

కొమిరి వెంకటాపురంలో యోగా శిక్షణ

రేగిడి: మండలంలోని కొమిరి వెంకటాపురంలో శనివారం శ్రీకాకుళం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో రవి శంకర్ గురూజీ పిలుపు మేరకు ధ్యానం, జ్ఞానంపై స్థానిక ప్రతినిధి కింజరాపు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ దేశూళ్ల సురేంద్ర , వాణిజ్య పన్నుల అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణ, కేజే నాయుడు పాల్గొన్నారు.

కేఆర్‌పేట మాజీ సర్పంచ్ మృతి

వేపాడ: కృష్ణారాయుడుపేట మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు ఇసరపు కృష్ణ(58) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు తేజ ఉన్నారు. కృష్ణ భౌతిక కాయం వద్ద డీసీసీబీ చైర్మన్ వీవీసీహెచ్ రాము నాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు గొంప కృష్ణ, గుడిపాల సర్పంచ్ బోజంకి రామునాయుడు, పోతల వెంకట రమణ, జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, నాయకులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

పంప్‌హౌస్ కార్మికులు భిక్షాటన


భిక్షాటన చేస్తున్న కార్మికులు

విజయనగరం దాసన్నపేట: విజయనగరం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పంప్‌హౌస్ కార్మికులు జీతం చెల్లిస్తే పండుగ జరుపుకుంటామని శనివారం ఖాళీ కంచాలతో అర్ధనగ్నంగా భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ యూనియన్ నాయకులు జగన్మోహన్‌రావు మాట్లాడుతూ నెలరోజులుగా బకాయి వేతనాల కోసం అధికారులు చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు.జీతాలు చెల్లించకుండా పండుగ పూట కార్మికులను పస్తులతో ఉంచడం, కొత్త బట్టలు లేకుండా అడుక్కునే పరిస్థితి తీసుకురావడం దురదృష్టకరమని చెప్పారు. అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దీంతో మునిసిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు స్పందించి ఒక్కనెలైనా జీతం కాంట్రాక్టర్‌తో ఇప్పించే ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించామని తెలిపారు. కార్యక్రమంలో పంప్‌హౌస్ కార్మికుల నాయకులు మురళి, అరుణ్, సత్యనారాయణరావు, సన్యాసిరావు, బంగారునాయుడు పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రం పరిశీలన

రాజాం: చెత్త సంపద కేంద్రానికి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘం కమిషనర్ ఎంవీ నాగరాజు ఆదేశించారు. శనివారం స్థానిక జెండాల దిబ్బవద్ద చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. పురపాలక సంఘంలో చెత్తను సకాలంలో తీయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను, సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల సమ్మెకాలంలో 112 టన్నులు చెత్త పేరుకుపోయిందని, ఆ చెత్తను తొలగించడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. సంక్రాంతి పురస్కరించుకుని వివిధ గ్రామాల నుంచి ప్రజలు సామగ్రి కొనుగోలు చేయడానికి వస్తారన్న ఉద్దేశంతో రహదారిపై దుమ్ము, దూళి ఎగరకుండా ఉండాలనే ఆలోచనతో వాటర్ ట్యాంకులు ద్వారా నీరు చల్లించామని చెప్పారు.


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాగరాజు